
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కూలిన టీజీ సైడ్ వాల్



రుద్రవరం సమీపంలోని 21వ బ్లాక్ సమీపంలో కూలిన ప్రధాన కాల్వ సైడ్‌వాల్

- జలసిరులు ప్రవహించే కాల్వలపై నిర్లక్ష్యం
- గట్టు మరమ్మతు పనులు చేయిస్తాం - తెలుగుగంగ ఇన్‌చార్జి ఎస్ఈ ప్రతాప్

రుద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంత రైతులకు వర ప్రసాదిని తెలుగుగంగ ప్రధాన కాల్వ పట్ల పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో తెలుగు గంగకు 1.14 లక్షల ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. 39 బ్లాక్ ఛానెళ్లు ఉన్నాయి. అధికారులు, పాలకులు గంగ ప్రధాన కాల్వ పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యం అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలిన సైడ్‌వాల్

తెలుగుగంగ ప్రధాన కాల్వలో భాగంగా 21, 22 బ్లాక్‌ఛానెళ్ల సమీపంలో సైడ్‌వాల్ కూలిపోయింది. 21వ బ్లాక్ సమీపంలోని సైడ్‌వాల్ కూలడంతో బ్లాక్‌ఛానెళ్ల తూముకే ప్రమాదం పొంచి ఉందన్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు అంటున్నారు. ప్రధాన కాల్వకు ప్రమాదం జరిగితే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారని అడుగుతున్నారు.

కూలిపోయి నెలలు గడుస్తున్నా..:

ప్రధాన కాల్వ సైడ్ వాల్ కూలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు ఆ వైపు వచ్చి చూసి వెళ్లారే తప్ప కనీసం ఇసక సంచులు కూడా ఇంత వరకు వేయించలేదు. రైతులకు నీరందించే కాల్వల పట్ల అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో వారికే తెలియాలని రైతులు విమర్శిస్తున్నారు. నెలలు గడిచినా పట్టించుకోకుండా ఉండడంపై అంతర్యమేమిటి? ఈ విషయం జలవనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందా, లేదా, వెళ్లినా పట్టించుకోకుండా ఉండడానికి గల కారణాలేమిటన్న విమర్శలు రైతుల్లో ఉన్నాయి.



22వ బ్లాక్‌ఛానెల్ సమీపంలో కూలిన సైడ్‌వాల్

అక్కడ గట్టు బలహీనంగా..

21 బ్లాక్‌ఛానెల్ సమీపంలో సైడ్‌వాల్ కూలడంతో గట్టు బలహీనంగా ఉంది. అక్కడే బ్లాక్‌ఛానెల్ తూము కూడా ఉంది. సుమారు వంద అడుగుల ఎత్తులో కాల్వ ఉంది. అక్కడ గండి పడితే ప్రమాదం ఎలాగుంటుందో అధికారులకు తెలియాలి. కానీ ఇంత వరకు వేయించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టినట్లయింది.

గట్టుకు మరమ్మతులు చేయిస్తాం

తెలుగుగంగ ప్రధాన కాల్వ 21వ బ్లాక్‌ఛానెల్ వద్ద కూలిన సైడ్ వాల్‌కు మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకున్నాం సాగునీటి సంఘం చైర్మన్‌ను ఆదేశించాం.

- ప్రతాప్, టీజీపీ ఇన్‌చార్జి ఎస్ఈ

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1. 37 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీని దేవ స్థానం కాలక్షేపపు మండపంలో శుక్రవారం ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈ ఓ వాణి ఆధ్వ ర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్త లు స్వా మి వారికి సమర్పించిన కానుకల్లో నగదు రూ.1,37,79,215, బంగా రం 6.74 గ్రాములు, వెండి 18. 990 కిలోలు వచ్చాయని తెలి పారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంక టేశ్వరరావు పాల్గొన్నారు.

'వందేమాతరం' దేశభక్తిని చాటింది

- ఎస్పీ సునీల్ షెరాన్



వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో దేశభక్తిని, ఐక్యతను చాటిందని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. వందేమాతరం గీతం 150ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో గీతాలపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ గీతం దేశ స్ఫూర్తిని, త్యాగాన్ని గుర్తు చేస్తుందన్నారు. గతంలో ప్రజల్లో ఆటలపాటలతో చైతన్యం కలిగించేవారని గుర్తు చేశారు. విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని అల పించారు. కార్యక్రమంలో నంద్యాల ఏఎస్పీ మందా జావళి, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మోహన్‌రెడ్డి, సూర్యమౌళి, జీవన్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు

- 18,396 మంది దరఖాస్తులు
- 75 గోల్డు మెడల్ పీహెచ్‌డీల ప్రదానం
- ఉప కులపతి వి. వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని ఉపకులపతి వి. వెంకట బసవరావు తెలిపారు. శుక్రవారం వర్సిటీలోని కాన్ఫరెన్సు హాలులో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ వి. వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవానికి 18,396 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 75 మందికి గోల్డ్ మెడల్ పీహెచ్‌డీలు ప్రదానం చేయబోతున్నామని తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి జస్టిస్ గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేశ్ హాజరవుతారని తెలిపారు. ఏమ్ గ్రీన్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ వి. రామకుమర్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయబోతున్నామని తెలిపారు. స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న బంగారు పతక విజేతలు, పరిశోధక విద్యార్థులు స్నాతకోత్సవానికి ముందు కంట్రోలర్ ఆఫ్ పరీక్షల విభాగంలో ఎంట్రీ పాసులు పొందాలని సూచించారు. విద్యార్థితో పాటు మరొకరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలోపు రిజిస్ట్రేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, 10 గంటల కంతా స్నాతకోత్సవ హాలులో సిద్ధంగా ఉండాలని సూచించారు. డీన్లు సుందరానందపుచ్చా, భరత్‌కుమార్, సి. విశ్వనాథరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

12న గవర్నర్ రాక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ కర్నూలుకు రానున్నారు. రాయలసీమ యూనివర్సిటీ 4వ కాన్వికేషన్ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అనంతరం నగరంలోని మాంటిస్సోరి స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.



మాట్లాడుతున్న ఆర్‌యూ ఉపకులపతి

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- జాప్యం చేస్తే సహించం
- మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్ నవంబరు 7(ఆంధ్ర జ్యోతి): ప్రజాదర్బార్‌కు వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో జాప్యం వహిస్తే సహిం చేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజా సమస్య లను వింటూ వినతులను ఆయన స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల్లో ప్రజా దర్బార్ నిర్వహిస్తుందన్నారు. అధికారులు ఉండి సమస్యలను పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నిండు కుండలా శ్రీశైలం

- నీటి మట్టం 885 అడుగులు
- సామర్థ్యం 210.03 టీఎంసీలు



శ్రీశైలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయం పూర్తి స్థాయి నీటినిల్వతో నిండుకుండలా మారింది. శుక్రవారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 32,460 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 4,560 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 58,426 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడి, ఎడమ గట్టు గట్టు విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 27,000, 35,315 క్యూసెక్కులు మొత్తంగా 62,315 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. జలాశయంలో నీటిమట్టం 885 అడుగులు ఉంది. నీటిసామర్థ్యం 215 టీఎంసీలకుగాను 210.03 టీఎంసీలుగా నమోదైంది.

భ్రామరికి ఊయల సేవ

గ్రామ దేవతకు వార పూజలు



ఊయల సేవలో పూజలందుకున్న స్వామి, అమ్మవారు

శ్రీశైలం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో భ్రమరాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి, ఊంజల సేవ నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం గ్రామదేవత అంకాలమ్మవారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు. సాయంత్రం లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ప్రాకార మండపంలో అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఊయలలో స్వామి, అమ్మవార్లను ఆసీనులజేసి షోడశోపచారపూజా క్రతువులను వైభవంగా నిర్వహించారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌పై విజయం

నంద్యాల హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సుదర్శన్‌బాబు అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరిం చుకొని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు శుక్రవారం వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సుదర్శన్‌బాబు మాట్లాడుతూ క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదని, ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందని అన్నారు. ప్రతి ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదయ్యాయని, ఆలస్యంగా గుర్తించడంతో రేడియో, కీమో థెరపీ తీసుకోవాల్సి వస్తోందని అన్నారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకుంటే క్యాన్సర్‌ను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డా. అంకిరెడ్డి, డా. లక్ష్మీప్రసన్న, డా. భావనారెడ్డి, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మహానందిలో ప్రముఖుల పూజలు

మహానంది, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాసం పురస్కరించుకొని పలువురు ప్రముఖులు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఇందులో సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్, ఏపీ సచివాలయాల కమిషనర్ శివప్రసాద్ దంపతులు వేర్వేరుగా పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మండపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరివెంట ఏఎస్‌సీ శైలేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, అటవీశాఖ రేంజర్ జడేన్‌జా, డీఆర్వో హైమవతి, ఎఫ్‌బీవో రాణా ప్రతాప్ పాల్గొన్నారు.



మహానందిలో పూజలు నిర్వహించి వస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్

అవినీతి అధికారులపై చర్యలు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో అవినీతికి పాల్పడిన అధికారులపై కొరడా ఝుళిపిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలు పి.రజని జారీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని బొమ్మూరు, కాతేరు, హుకుంపేట, పిడుంగొయ్యి గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగం, అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలకు సంబంధించి 2020-2024 సంవత్సరాలలో లోకాయుక్తకు రెండు ఫిర్యాదులు వచ్చాయి. మచిలీపట్నానికి చెందిన జె.శ్రీనివాసగౌడు దాఖలు చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రామాలకు చెందిన అధికారులు పంచాయతీ అధికారి కేపీ చంద్రశేఖర్, పి.సురేష్‌బాబు, బి.రామశ్రీనివాస్, డి.విజయరాజుతో పాటు మరికొందరిపై ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత లోకాయుక్త పదవీ ఖాళీగా ఉండడంతో ఉప లోకాయుక్త రజని కేసును విచారించారు. సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది. ఇతర అధికారులైన రామ ప్రసాద్‌రావు, బెన్హర్ ఎడ్వర్డ్, రామ్మోహన్‌రావు, మహేశ్వరప్రతాప్, శ్రీనివాసరావు, సుభాషిణిపై కూడా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం ఉప లోకాయుక్తకు తెలియజేసింది.

దిగుబడి లేదు.. ధర లేదు 6

వలసలు నివారించాలి

- చెరువులను నింపడంలో అధికారుల నిర్లక్ష్యం 7
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- జడ్పీటీసీల ఆవేదన
- ముగిసిన సర్వసభ్య సమావేశం

అందాల నల్లమల



నల్లమలలోని తుండ్లవాగు తీరం ఇలా..



నల్లమల కొండల మధ్య ప్రవహిస్తున్న తెలుగుగంగ కాలువ

చాగలమర్రి/రుద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో నల్లమల అందాలు కనువిందు చేస్తున్నాయి. ఎగువ కొండల నుంచేగాక, తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి కూడా వరద వస్తోంది. పచ్చని కొండలు, పచ్చదనంతో నిండిన పంటలు, పరిసరాలలో జలాశయం, టీజీపీ కాలువలో ప్రవహిస్తున్న నీరు మనోహరంగా కనిపిస్తోంది. ఈ ప్రకృతి అందాలు సందర్శకులను ఆహ్లాదపరుస్తున్నాయి. చింతలచెరువు గ్రామ సమీపంలో, తుండ్లవాగు రిజర్వాయర్ ప్రాంతాల్లో నల్లమల అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

- స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్
- అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యులు



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి సమయానికి చికిత్స చేసుకుంటే నివారించవచ్చని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రకాష్ అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వద్ద ర్యాలీని కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్యాన్సర్ పట్ల భయపడాల్సిన అవసరం లేదని ప్రజల్లో అవగాహన కల్పిం చడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డా.కృష్ణ ప్రకాష్ తెలిపారు. డా.కే. వెంకటేశ్వర్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఎస్ఆర్ఎంవో డా.బీ.హేమనళిని, జీజీహెచ్ ఆర్ఎంవో డా.వెంకటరమణ, క్యాన్సర్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా.ఉమామహేశ్వరరెడ్డి, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ డా.నాగరాజు డా.సాయి మాధురి పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీ డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ శరీర భాగంలో ఎక్కడైనా గడ్డలు పుట్టుమచ్చల్లో మార్పులు, మానని పుండ్లు, గొంతులో గరగర, నిత్యం పొడి దగ్గు, మల మూత్ర విసర్జనలో అలవాట్లలో మార్పులు, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డా.మహేశ్వర ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డా.రఘు, జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు, డెమో ప్రకాశ్‌రాజ్, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే.అరుణ, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ప్రాణాంతకంగా పిచికారీ

- రైతులను బలి తీసుకుంటున్న క్రిమి సంహారక మందులు
- స్ప్రేపై అవగాహన కొరవడి ఆసుపత్రిపాలు



ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి వానలే వానలు.. ఈసారి ఖరీఫ్‌లో మే నెలాఖరులోనే వర్షాలు పడటంతో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలను రైతులు సాగు చేశారు. అయితే ఆగస్టు నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తూనే ఉన్నాయి. వారం రోజుల క్రితం మొంథా తుఫాన్‌తో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ప్రస్తుతం పొలాల్లో ఇంకా వర్షం నీరు మడుగులా నిలిచి ఉన్నాయి. దీంతో తెగుళ్లు, క్రిమికీటకాలు విజృంభించాయి. పంటను కాపాడుకోడానికి రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి క్రిమి సంహారక మందులను వినియోగిస్తున్నారు. జిల్లాలో పురుగు మందుల వాడకం ఎక్కువగా జరుగుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో వ్యాపిస్తున్న పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు రెండు, మూడు మందులు, గుళికలను పంటలపై స్ప్రే చేస్తున్నారు. ఈ సందర్భంలో రైతుల నోట్లోకి, కళ్లలోకి ఈ మందులు వెళ్లి ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

-కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)

ప్రమాదకరమైన మందులు

పంటలకు వినియోగించే పురుగు మందుల్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ 5 రకాలుగా విభజించింది. మోథియాన్, మోనోక్రోటోపాస్, ఫోరేట్(గుళికలు) పాస్మామిడాన్, మోథోమిల్, కార్బొఫ్యూరాన్, డైక్లోరోవాష్, ఎసిపేట్, ఫెన్‌వాలరేట్, ఎమిడాక్లోపిడ్, బైఫెత్రిన్, కార్బరిల్, కార్బొసల్ఫాన్, క్లోరోఫైరిపాస్, సైపర్ మైత్రిన్, ఏథియాస్, డైకోఫాల్, ప్రొఫెనోపాస్, క్వినాల్‌పాస్ తదితర మందుల్ని గుర్తించారు. పత్తిలో పురుగు నివారణకు ఫెన్‌వాలరేట్‌ను వినియోగిస్తున్నారు. కాయలో పలకుచేరుకునే పురుగును నివారించేందుకు రెండు మూడు మందులతో కలిపి దీన్ని వినియోగిస్తున్నారు. ఈ మిశ్రమం ఎక్కువ ప్రమాదకరం.



చైనా యంత్రాలు ప్రమాదమే:

దశాబ్దం కిందట పురుగును నివారించేందుకు చేతితో తిప్పే స్ప్రేయర్లతో పొడి మందులు పైరుపైన చల్లేవారు. తర్వాత వీపుకు డబ్బాలు తగిలించుకొని చేతితో ఉపయోగించే పంపు స్ప్రేయర్లు వాడకంలోకి వచ్చాయి. చైనా ఉత్పత్తి చేసిన స్ప్రేయర్లు తక్కువ ధరకు దొరుకుతున్నాయి. కానీ అవి తక్కువ దూరానికి మందు వెదజల్లుతాయి. దీని వల్ల రైతుల శరీరభాగాలకు మందు సులువుగా వ్యాపిస్తుంది. తద్వారా రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యంత్రాల ప్రమాణాల ప్రకారం చదరపు అంగుళానికి 350 బిందువుల దాకా పైరుపై పడాలి. చైనా స్ప్రేయర్లు 10 అడుగులు మాత్రమే మందును చల్లగలవు. గాలి వ్యతిరేకంగా వీచినప్పుడు మందు నీళ్ల రైతు శరీరం మీద పడటం వల్ల ప్రమాదమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మందు శరీరంలోకి వ్యాపించకుండా జాగ్రత్తలు

- మందు స్ప్రే చేసే సమయంలో చేతులకు తొడుగులు వేసుకోవాలి.
- మూతికి మాస్క్ తగిలించుకోవాలి.
- గాలి వల్ల మందు మీదకు రాకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ప్లాస్టిక్ తరహా చొక్కా వాడాలి.
- పిచికారి తర్వాత పూర్తిగా శుభ్రం చేసుకొని అన్నం తినాలి.



సేంద్రియ విధానం ఆరోగ్యానికి శ్రేయస్కరం

- ప్రస్తుతం పత్తిలో గులాబి పురుగు నివారణకు సేంద్రియ పద్ధతిలో లింగాకర్షక బుట్టలు వినియోగిస్తున్నారు.
- వేపగింజల కషాయంతో పాటు వైరస్ ద్రావణం బెల్లంతో కలిపి పిచికారి చేయాలి. ట్రైకోగామా మిత్ర పురుగులను వదిలితే ప్రాణహాని ఉండదు.
- సేంద్రియ సాగువల్ల పెట్టుబడి తగ్గుతుంది.
- ఈ దిశగా ప్రస్తుతం 45 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

మిశ్రమ మందులు విష పూరితం

పురుగుమందు ఏదైనా సరే విషపూరితమేనని రైతులు గుర్తించాలి. పురుగు త్వరగా చనిపోతుందని రైతులు ఆతృతతో ఎక్కువ మందుల్ని మిశ్రమం చేసి వినియోగిస్తున్నారు. ఇది విష పదార్థంగా తయారై రైతు శ్వాసక్రియను దెబ్బతీస్తుంది.

\- రాజశేఖర్, అగ్రానమి ఏడీఏ

నిర్లక్ష్యంతో ప్రాణాలకు హాని



రైతులు పంట తెగుళ్ల నివారణకు విషపూరితమైన మందులను వినియోగిస్తున్నారు. ఆ సమయంలో అవి శరీరానికి అంటకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. క్రిమిసంహారక మందులను ఎలా వినియోగించాలో మండల వ్యవసాయాధికారులు, గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకు హానీ.

\-వరలక్ష్మి, జేడీ



దిగుబడి లేదు.. ధర లేదు


చింతలచెరువులో ఉల్లిపంటను దున్నేస్తున్న రైతు

- ఉల్లి రైతు కంట కన్నీరు
- సాగు ఖర్చులు కూడా రాని వైనం
- పంట పొలాలను దున్నేస్తున్న రైతు
- క్వింటం ధర కేవలం రూ.500
- ఆదుకోవాలంటున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి. ఈ ఏడాదైన ఉల్లి పంట సాగు చేసి అప్పులు తీర్చుకుందామని అనుకున్న రైతులు అధిక వర్షాలతో, ధరల పతనంతో అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. వరుస తుపాన్‌లతో చేతికొచ్చిన పంట కుళ్లిపోయి దెబ్బతినింది. ఈ ఏడాది పెద్ద బళ్లారి ఉల్లి అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పంట కోత సమయంలో ధర పతనమైందని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. మూడు నెలల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చారు. కోత సమయంలో మొంథా తుఫాన్ ముంచేసింది. మండలంలోని చింతలచెరువు, కొలుములపేట, పెద్దవంగలి, చిన్నవంగలి, మూడురాళ్లపల్లె, ఆవులపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో 800 ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేశారు. చింతలచెరువు, కొలుములపేట గ్రామాల్లోనే 300 ఎకరాలు పైగా ఉల్లి పంట సాగు చేశారు. ఎకరాకు 40 క్వింటాళ్ల నుంచి 60 క్వింటాళ్ల దాకా దిగుబడి రావాల్సి ఉండగా 10 క్వింటాళ్లు కూడా వచ్చేలా కనిపించడం లేదు. చిన్నవంగలి గ్రామంలో కొందరు రైతులు ఉల్లిపంటను కోత కోసి పంట పొలాల్లోనే వదిలేశారు. ఈ గ్రామాల్లో కొందరు ప్రజలు ఉల్లిగడ్డలను సంచులతో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. చింతలచెరువు, కొలుములపేటలో కొందరు రైతులు ఉల్లిపంటను దున్నేశారు. మరి కొందరు గొర్రెలకు మేతగా వదిలేశారు. క్వింటం రూ.500 కూడా పలకకపోవడంతో రైతులు ఉల్లిగడ్డలను కోసేందుకు కూలీ ఖర్చులు కూడా రావని తలంచి పొలాల్లోనే వదిలేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


కొలుములపేటలో ధర లేక పొలంలోనే ఆరబెట్టిన ఉల్లిగడ్డలు



వర్షాల వల్ల నష్టపోయాం:

మూడెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. కోత సమయంలో తుఫాన్‌లు దెబ్బతీశాయి. కూలీ ఖర్చులు కూడా వచ్చేలా లేదు. దీంతో పంటను దున్నేసి, ప్రత్యామ్నాయ పంట సాగుకు ప్రయత్నిస్తున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

\-మద్దిలేటి, రైతు, చింతలచెరువు



నష్టపోయాం.. ఆదుకోండి

4 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. పంట కోత సమయంలో మొంథా తుఫాన్ ముంచేసింది. కోసిన ఉల్లిగడ్డలు తడిసి దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలి.

\-సహదేవరెడ్డి, రైతు, కొలుములపేట

అత్యధికులు మాట్లాడే భాష తెలుగు

- పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని విస్మరించకూడదు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- కన్నుల పండువలా ముగిసిన కర్నూలు ఉత్సవ్-2025


ప్రథమ బహుమతి పొందిన కళాకారులను సత్కరిస్తున్న టీజీ

కర్నూలు కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధికులు తెలుగు భాష మాట్లాడతారని, దేశంలోనే మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుకవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గత వారం రోజులుగా కొనసాగిన 'కర్నూలు ఉత్సవ్-2025' కన్నుల పండువలా ముగిసింది. ఈ ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానం, కళారం గంలో విశిష్ట సేవకులకు సత్కారం కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. తొలుత తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ రోజున ప్రారంభించిన వారం రోజుల కార్యక్రమాలు నిత్యకల్యాణం పచ్చతోరణంలా టీజీవీ కళాక్షేత్రంలో అలరించాయని అన్నారు. ఈ కార్యక్రమాల రూపకల్పనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన వారిని, సహకారాలు అందించిన వారిని ఆయన పేరుపేరునా ప్రశంసించారు. ఎవరి భాష వారికి కన్నతల్లి వంటిదని, తెలుగు మాట్లాడేవారు దేశంలోనే అత్యధికులని అన్నారు. రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములును ఎవరూ మర్చిపోకూడదని గుర్తుచేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్ ఏడు రోజులు వైభవంగా నిర్వహించడంలో టీజీ వెంకటేశ్ సహకారం ఎంతో ఉందని అన్నారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యావేత్తలు జి.పుల్లయ్య, కేవీఎస్ రాజశేఖర్ ఎంతో సహకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, కళాక్షేత్రం ఇతర ప్రతినిధులు కేవీ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, కె. రామస్వామి, పీపీ గురుమూర్తి, పి. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

● ఏకాంకిక నాటక పోటీల్లో విజేతలు వీరే...

గత వారం రోజులుగా కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక పోటీల్లో విజేతలను న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. ఉత్తమ ప్రదర్శన రూ.15 వేలు నగదు బహుమతిని భక్త చింతామణి (పురాణం ఘట్టం) గెల్చుకుంది. బిల్వ మంగళుడుగా ఆర్‌సీ లక్ష్మణరాజు (ఉల్చాల), రాధగా తిరుమలాబాయి (తెనాలి), దామోదరునిగా శేషయ్య (నంద్యాల) నటించారు. ద్వితీయ ప్రదర్శన రూ.12 వేలు నగదు బహుమతిని గయోపాఖ్యానం (యుద్ధసీను) గెల్చుకుంది. శ్రీకృష్ణుడిగా బి. బజారి నాయుడు(పెనుమాడ), అర్జునుడిగా జె. మంజునాథ్ (ఎమ్మిగనూరు) నటించారు. తృతీయ ప్రదర్శనగా 10వేలు నగదు బహుమతిని శ్రీకృష్ణ తులాభారం (ప్రణయ ఘట్టం) గెల్చుకుంది. శ్రీకృష్ణుడిగా ఎం. మురళీ శ్రీనివాస్ (సి. బెళగల్), సత్యభామగా ఎం. రేణుక (బి.తాండ్రపాడు) గెల్చుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీనియర్ రంగస్థల నటులు ఎన్ జానకిరామ్, పి. రాజారత్నం వ్యవహరించారు. ఈ కళాకారులకు టీజీ వెంకటేశ్ బహుమతులు అందజేశారు.


బహుమతులు పొందిన కళాకారులకు సత్కారం

రాఘవేంద్రస్వామి మఠానికి రూ.3.25 లక్షలు విరాళం

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన సుస్మిత అనే భక్తురాలు రూ.1.25లక్షలు, హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర సందీప్ అనే భక్తుడు రూ.2లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. శక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. రూ.3.25 లక్షలు విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంత పురాణిక్, నరసింహ దేశాయ్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహా యింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 కన్నా ముందు నియమితులైన ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణత కావాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే రివ్యూచేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, సుబ్బరాయుడు, నాగన్న, రహీం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'వందేమాతరం' గేయాలాపన



కర్నూలులో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం 150 ఏళ్ల సందర్భంగా కర్నూలులో కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ వందేమాతర గీతం ఒక జాతిని మేల్కొలిపిన శక్తి అని తెలిపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి సామాన్యులను సమరయోధులుగా మార్చిందని, ఈ గీతం భారతమాత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, భారత ప్రజల ఐక్యతను వైవిధ్యాన్ని జరుపుకుంటుందని తెలిపారు. జేసీ నూరుల్ కమర్, సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, డీఈవో శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, ఆర్ఐ ఓ.లాలెప్ప, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది, ఎన్‌సీసీ కేడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

భారత స్వాతంత్ర సమరానికి ప్రేరణనిచ్చిన వందేమాతరం జాతీయ గేయం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది వందేమాతరం జాతీయ గేయాన్ని ఆలపించారు. అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబు ప్రసాద్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో..


పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

వలసలు నివారించాలి

- చెరువులను నింపడంలో అధికారుల నిర్లక్ష్యం
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- రైతులను ఆదుకోని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- జడ్పీటీసీల ఆవేదన
- ముగిసిన సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాల్గొన్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసలు నివారించేందుకు అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయం- అనుబంధ శాఖలు, నీటి యాజమాన్య సంస్థ, మత్స్య శాఖ, దేవదాయ శాఖ తదితర అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెకర్లు డా. ఏ. సిరి, జి. రాజకుమారి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలపై జడ్పీటీసీలు ప్రశ్నల వర్షం కురిపించగా వాటికి అధికారులు సమాధానాలు చెప్పారు. చైర్మన్ మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడానికి అధికారులు గ్రామ స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. అవుకు రిజర్వాయర్ ఎందుకు నింపలేదని అధకారులను జడ్పీటీసీలు ప్రశ్నించారు.



రైతుల ఖాతాల్లో రూ.10 కోట్లు జమ

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లి పంటకు రూ.10 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, మిగిలిన రూ.8 కోట్ల మొత్తాన్ని త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కర్నూలు కలెక్టర్ డా.ఏ .సిరి అన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించి వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. .కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తిలో తేమ శాతం 13,14 శాతం ఉన్నా కూడా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉపాధి హామీ పనులతో జిల్లాలో వలసలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుంగభద్ర హొస్పేట్ డ్యాంలో ఉన్న 30 గేట్‌లు మరమ్మతులు చేస్తున్నందున ఖరీఫ్, తాగునీటికి తప్ప, రబీకి నీరు ఇవ్వరని బోర్డు అధికారులు తెలిపిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరలో ఏర్పాటు..



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని నంద్యాల కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఎన్‌హెచ్-340 జాతీయ రహదారి నిర్మాణం కారణంగా బ్రాహ్మణకొట్కూరు- దిగువపాడు ప్రాంత రైతులకు దాదాపు 2500 ఎకరాల పొలాలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు తగిన పరిష్కార చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. మిడ్తూరు మండలం జలకనూరు, మద్దిలేరు వాగు మరమ్మతుల కోసం రూ.44 లక్షలు మంజూరు చేశామని, మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో 11,448 హెక్టార్ల పంట దిబ్బతినిందని, నష్టపరిహారం నిమిత్తం సంపూర్ణ నివేదకను ప్రభుత్వానికి పంపించామని అన్నారు.

బ్రాహ్మణకొట్కూరులో పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాప్‌ను తొలగించాలని గత ఎన్నో సమావేశాలలో అడిగిన అధికారులు స్పందించడం లేదని, తక్షణమే వైన్ షాప్‌ను తొలగించాలని నందికొట్కూరు జడ్పీటీసీ కరీమున్నిసా కోరారు.

- శనగలు సబ్సిడీ కింద ప్రభుత్వ ధర కంటే బయటకే తక్కువగా కొనుగోలు చేస్తున్నారని, సబ్సిడీ కింద రైతులు ప్రభుత్వం నుంచి రూ. 5800 కొనుగోలు చేస్తుంటే బయట రూ.5600కే దొరుకుతున్నాయని ఓర్వకల్లు జడ్పీటీసీ రంగనాథగౌడు అన్నారు. నష్టపోయిన ఉల్లి రైతులకు హెక్టారుకు రై.50 వేలు చెల్లిస్తామని, ఇప్పటి దాకా ఇవ్వలేదని అన్నారు.
- మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో మొక్కజొన్న మొత్తం వర్షానికి నాశనం అయిపోయిందని, నష్టపరిహారం చెల్లించాలని జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి కోరారు.
- మిడ్తూరు మండల పరిధిలోని జలకనూరు చెరువుకు మరమ్మతు చేపట్టాలని జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి కోరారు.
- ఉల్లి పంట వరదలో మునిగిపోయిందని, ఉల్లి రైతులను ఆదుకోవాలని సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప కోరారు.
- చెరువులో తీస్తున్న మట్టిని అక్కడే వేయకుండా చెరువు గట్టుపై వేసేలా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు జడ్పీటీసీ కోరారు.
- పత్తి కొనుగోలు చేయడం లేదని...కూటమి ప్రభుత్వ వచ్చాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు.

ఈ సమావేశంలో సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఐదు అంశాలకు ఆమోదం..

- జిల్లాలో 138 పనులకు రూ.5.91 కోట్లు మంజూరు.
- జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో రూ.25 లక్షలతో లిఫ్ట ఏర్పాటు
- సున్నిపెంటలో పని చేస్తున్న కార్మికులకు జడ్పీ నిధుల నుంచి జీతాల చెల్లింపు
- స్త్రీ శిశు సంక్షేమ శాఖకు మంజూరు చేసిన రూ.3.52 కోట్ల పనుల రద్దు
- 59 సీపీసీడబ్ల్యూ స్కీం నిర్వహణకు టెండరుకు ఎవ్వరూ ముందుకు రావపోవడంతో పాతవారితోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు.



కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయని, పరిహారం చెల్లించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. పంట వేసుకునేది కౌలు రైతులు కాబట్టి, నష్ట పరిహారం కౌలు రైతులకు ఇప్పించాలన్నారు. పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేయాలని అన్నారు. నంద్యాల చెక్‌పోస్టు వద్ద రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కేజీ శనగలు కూడా దొరకడం లేదు



ఆదోని మండలంలో కేజీ శనగ కూడా దొరకడం లేదని కురువ కార్పొరేషన్ చైర్మన్ ఎం.దేవేంద్రప్ప అన్నారు. పెద్ద హరివాణంలో 14 వేల ఎకరాల్లో శనగ పంట వేస్తారని, అధికారులు శనగ విత్తనాలు ఎందుకు పంపిణీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. పత్తి కొనుగోలు లేకపోవడంతో రైతుల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వంకలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఆదోని మండలంలో మార్కెట్ యార్డు నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల సమన్వయంతో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.

నేర పరిశోధనలో టెక్నాలజీని వాడండి

- పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి
- ఎస్పీ సునీల్ షెరాన్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో ఆధునిక టెక్నాలజీని వాడాలని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోక్సో కేసులో చార్జ్‌షీటు త్వరగా దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ఎల్ఎస్(ఫోరెన్సిక్ ల్యాబ్ అండ్ సైన్స్) రిపోర్టు వచ్చిన కేసుల్లో చార్జ్‌షీటు వేసిన తరువాత కోర్టులో తిరస్కరణకు గురికాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం నమోదైన కేసుల వివరాలు అడిగి తెసుకున్నారు. మిస్సింగ్ కేసులు, అనుమానాస్పద మరణాలు దర్యాప్తు చేసి వెంటనే కేసులను పూర్తి చేయాలన్నారు. సైబర్‌క్రైం, మర్డర్, యూఐ(అండర్ ఇన్‌వెస్టిగేషన్) పీటీ కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. రహదారి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ మందా జావళి, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడితో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో నిందితుడు నూరుల్లాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. ఈనెల 5వ తేదీన ఫయాజ్‌బాషా అనే వ్యక్తిపై నూరుల్లా దాడి చేసి గాయపరిచాడు. ఫయాజ్‌ను కాపాడడానికి వచ్చిన అతని మిత్రుడు చిన్న హుశేన్‌పై కూడా దాడి చేశాడు. వీరిద్దరి మధ్య ఆర్థిక సమస్యలే దాడికి కారణమని పోలీసులు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురికి జైలు


నిందితులతో పోలీసు అధికారులు

ఆళ్లగడ్డ/సంజామల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఆరుగురికి రెండేళ్ల జైలు శిక్ష తో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ ఆళ్లగడ్డ కోర్టు న్యాయాధికారి శైలజ తీర్పు చెప్పారు. వివరాలు.. సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాయలూరి సూర్యనారాయణరెడ్డి, చిన్నపరెడ్డి హనుమంతరెడ్డి, షేక్ కరీం బాష, ఓబయ్య, వెంకట్ రెడ్డి, ఇమాములు, పూల ఫకుర్‌బాష, దూదేకుల దస్తగిరి ఓకేసులో సాక్షులుగా ఉన్న నెమలి లక్ష్మీనారాయణరెడ్డి, అన్న నెమలి లక్ష్మిరెడ్డిపై దాడి చేశారు. అప్పటి కోవెలకుంట్ల సీఐ కేశవరెడ్డి నిందితులను అదుపులోకి తీసుకొని ఫిబ్రవరి 7, 2016లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువైంది. రెండేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధించారు. కేసు విచారణలో ఉండగానే హనుమంతరెడ్డి, షేక్ కరీంబాషా మరణించారు. పీపీ శివప్రసాద్‌రావు, సంజామల ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది సహకరించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గిరీష్‌బాబు(ఫైల్)

బేతంచెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ బైక్‌ను కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం పట్టణ శివారులో కొలుమలపల్లె రస్తా జాతీయ రహదారిలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. గోరుమానుకొండ గ్రామానికి చెందిన జంగం గిరీష్‌బాబు(36) కర్నూలు రహదారిలోని కనుమ ఆంజనేయస్వామి పూజారిగా పనిచేస్తున్నారు. కొలుములపల్లె గ్రామంలో తన సమీప బంధువుల మృతి చెందడంతో గిరీష్‌బాబు అంత్యక్రియలు ముగించుకుని తిరిగి బేతంచెర్లకు వస్తున్నాడు. జాతీయ రహదారిని మోటారు సైకిల్ క్రాస్ చేసే సమయంలో డోన్ నుంచి కర్నూలు వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాణి, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కర్నూలు క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో డీమార్ట్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. బాలాజీనగర్‌కు చెందిన సాదిక్, సాజిదా అక్కాతమ్ముళ్లు. వీరిద్దరు కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఫ్లైఓవర్‌పైన ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. వీరిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి బంధువులకు సమాచారమివ్వడంతో వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపేటకు చెందిన కృపాల్‌సాగర్ (38) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ఎస్ ఆర్ ల్యాబ్ టెక్నీషియన్ నడుపుకుంటూ జీవనం సాగించే కృపాల్‌సాగర్ ఈ రోజు సాయంత్రం తన ల్యాబ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కృపాల్‌సాగర్‌కు రెండు నెలల క్రితం కృపాల్ సాగర్ మూగతికి చెందిన యువతితో వివాహం జరిగింది. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన కారు


నుజ్జునుజ్జయిన కారు

- ఒకరి పరిస్థితి విషమం

వెల్దుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొన్న ఘటన వెల్దుర్తిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమం కాగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలుకు చెందిన కార్తీక్, హరి, కార్తీక్ కలిసి డోన్‌లో వివాహ వేడుకలకు కారులో బయలుదేరారు. వెల్దుర్తిలోని హైవేపై హనుమాన్ జంక్షన్ వద్ద తెలంగాణ రాష్ట్రం అలంపూర్ నుంచి బెంగళూరుకు ఎండుమిర్చి లోడుతో ముందు వెళుతున్న వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. వాహనం వెనుక భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ హరి తలకు బలమైన గాయమైంది. కారులో ఉన్న మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ప్యాపిలి హైవే అంబులెన్స్ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో రోగిని జాయిన్ చేయించి తిరిగి ప్యాపిలికి వెళుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్యాపిలి అంబులెన్స్ పైలట్ ప్రసాద్, ఈఎంటీ అర్జున్ క్షతగాత్రులను కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసు చంద్రశేఖర్ ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కారు డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

నేడు, రేపు యురాలజీ వైద్యుల సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు యురాలజీ వైద్యుల సంఘం సంయుక్త నిర్వహణలో రెండు తెలుగు రాష్ట్రాల 37వ వార్షిక యురాలజీ వైద్యుల వైజ్ఞానిక సదస్సు ఈ నెల 8, 9తేదీల్లో నంద్యాలలోని సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి డా.భార్గవ వర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా. రవికృష్ణతో కలిసి స్థానిక ఐఎంఏ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. భార్గవవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో రాష్ట్రస్థాయి సదస్సు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. రెం డు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ నగరాలనుంచి 25మంది ప్రముఖ యూరాలజీ నిపుణులు పాల్గొంటారన్నారు. యురాలజీ విభాగం పీజీ విద్యార్థులు పరిశోధనాపత్రాలు సమర్పిస్తారన్నారు. దక్షిణభారత యూరాలజీ వైద్యుల సంఘం కార్యదర్శి డా.చంద్ర మోహన్, ఉస్మానియా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్, తెలుగు రాష్ట్రాల్లో యూరాలజీ విభాగ ఆద్యులు డా.విక్రమసింహారెడ్డి, డా.రవికృష్ణ అతిథులుగా పాల్గొంటారన్నారు. డా.దాసరి రమేష్, డా.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి డా..జైబాబురెడ్డి పాల్గొన్నారు.

షోలాపూర్ నుంచి ప్రత్యేక రైళ్లు

ఆదోని టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): షోలాపూర్ నుండి అనకాపల్లి వరకు రైలు ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే వారు ఈనెలాఖరు నుంచి ప్రతి శుక్రవారం రైలు నెంబర్ 01477ను ప్రతి శనివారం రైలు నెంబర్ 01478 అనకాపల్లి నుండి షోలాపూర్ వరకు నడపనున్నారు. జిల్లాలో మంత్రాలయం రోడ్, ఆదోని మీదుగా ఈ రైళ్లు నడుస్తాయి.

భర్తకు జీవిత ఖైదు


ముద్దాయి శ్రీనివాసులు

కర్నూలు లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. శ్రీనివాసులు 2007లో లక్ష్మీదేవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత భార్యపై అనుమానంతో తరచూ గొడవలు పడేవాడు. 2018లో ఆమెను హత్య చేశాడు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

బాధిత కుటుంబాలకు పరిహారం


చెక్కును అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థుల్లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు శుక్రవారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈఏడాది జనవరి 21న రాత్రి కర్ణాటకలోని సింధనూరు సమీపంలో తుఫాన్ వాహనం బోల్తాపడి డ్రైవర్ శివ(20)తో పాటు నలుగురు వేద విద్యార్థులు సుజయీంద్ర(22), హయవదన(19) అభిలాష(20), జయసింహ(19) మృతి చెందిన విషయం తెలిసిందే. మంత్రాలయం నుంచి మధ్వాచార్యుల ప్రథమ శిష్యులైన నరహరి తీర్థుల ఉత్తరారాధన కోసం హంపి సమీపంలో నవబృందావనానికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఈ నలుగురు వేద విద్యార్థులు మృతి చెందారు. వారి తల్లిదండ్రులకు రూ.5లక్షల ప్రకారం చెక్కులను పీఠాధిపతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి, విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

మఠానికి రూ.3.25లక్షల విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుస్మిత అనే భక్తురాలు రూ.1.25లక్షలు, హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర సందీప్ అనే భక్తుడు రూ.2లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. రూ.3.25 లక్షలు విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. అనంత పురాణిక్, నరసింహా దేశాయ్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇరువురిపై కేసు

కొలిమిగుండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తపై దాడి చేసిన కేసులో ఇరువురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. కోటపాడు గ్రామానికి చెందిన వెంకటరాముడు, అతని భార్య భూలక్ష్మీపై ఇదే గ్రామానికి చెందిన రాచకుంట చంద్రబాబు, ఎర్రన్న అనే వ్యక్తులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

నందికొట్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు రఘురామ్మూర్తి, సుంకయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మిక చట్టాలను కాలరాయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది, ఏఐటీయూసీ పట్టణ నాయకులు సుంకన్న, శంకర్ నాయుడు, ఉస్మాన్ భాష, నాగేంద్ర, మౌలాలి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

● జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్ఎం హైస్కూల్, రామకృష్ణ పీజీ కళాశాలలో జిల్లాస్థాయి ఖోఖో, సాఫ్ట్‌బాల్ పోటీలను పాఠశాల హెచ్ఎం అసదుల్లా, జిల్లా స్కూల్‌గేమ్ కార్యదర్శి బి.విశ్వనాథ్, జి.ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మండల విద్యాధికారి శివరాంప్రసాద్ హాజరయ్యారు. జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో నంద్యాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల కో ఆర్డినేటర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, దాదాపు 600మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు ఎన్జీ రంగా కృషి


ఎన్జీ రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సాహిత్యకారులు, రైతు సంఘం నాయకులు

నంద్యాల కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల, రైతాంగ సమస్యలపై ఆచార్య ఎన్జీరంగా నిరంతరం పోరాడారని ఆరుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎంపికై చరిత్ర సృష్టించి ప్రజాభిమానం పొందారని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం మాతృభాషా పరిరక్షణసమితి, నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా 126వ జయంతి వేడుకల నిర్వహించారు. ఎన్జీరంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకులు, డాక్టర్ కిషోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

మిడుతూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బోధనా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని ఎంఈవో మల్లికార్జున నాయక్ సూచించారు. శుక్రవారం టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు ఎంఈవో ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. బోధన సిద్ధాంత పద్ధతులు, సాంకేతిక సాధనలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అభ్యాస సామాగ్రిని ఉపయోగించి విద్యార్థులకు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సౌందర్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని రెండవ సచివాలయ పరిధిలో వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం స్వాతి, ఆశా వర్కర్లు చంద్రకళ, నజీరున్, ఉశేనమ్మ పాల్గొన్నారు.

శ్రీశైలమే ఒక మహాలింగం

● ప్రముఖ ప్రవచనకారుడు మహంతయ్య

శ్రీశైలం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మహా క్షేత్రమే ఓ మహా లింగమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారుడు మహంతయ్య అన్నారు. కార్తీమాసం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ దక్షిణమాడవీధిలో ఏర్పాటు చేసిక వేదికపై యాత్రికులకు కార్తీక పురాణం విశేషాలను తెలియజేశారు. కార్తీక మాసంలో స్వామిఅమ్మవార్ల సన్నిధిలో ఉంటూ శివనామస్మరణ చేయడం సకల శుభాలను కలిగిస్తుందని తెలిపారు.

స్వామి, అమ్మవార్లకు నృత్య నివేదన

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు గుడివాడకు చెం దిన శ్రీశివాని కూచుపూడి నృత్యాలయానికి చెందిన నిత్యకీర్తన, లాస్య, రాధాప్రియ, ధన్విక, విష్ణుప్రియ, సుధాతేజ్‌పాల్ తదితరులు చేసిన సాంప్రదాయ నృత్యాలు యాత్రికలను అలరించాయి.

హక్కుల కోసం ఉద్యమించాలి

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ రష్యా విప్లవ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, రామచంద్రుడు, ఏసురత్నం, నరసింహనాయక్, పట్టన కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు కుచ్చు టోపీ

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మహానంది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు బుక్ కీపర్ టోపీ పెట్టాడు. శుక్రవారం బాధిత మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా మండలంలోని గోపవరం గ్రామంలో ఐదు పొదుపు సంఘాల డబ్బులను సుమారు రూ. ఏడు లక్షలు బుక్‌కీపర్ కాజేసినట్లు మహిళలు ఆరోపించారు. విషయం బయటికి రావడంతో కొన్ని పొదుపు సంఘాలకు డబ్బులు చెల్లించాడు. ఇంకా దాదాపు రూ. 3 లక్షలు చెల్లించకపోవడంతో పొదుపు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో ఒకరి ప్రమేయం ఉందా...? పొదుపు సంఘాల అధికారుల హస్తం ఉందా అనేది తెలియాల్సి ఉంది.

చైతన్యాన్ని నింపిన 'వందేమాతరం'

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

● జిల్లా వ్యాప్తంగా వందేమాతరం ఆలాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతం గీతం భారతీయులలో చైతన్యాన్ని నింపిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూరైన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పటేల్‌సెంటర్‌లో వందేమాతరం గేయాన్ని యువత, మహిళలు, విద్యార్థులు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ఏకస్వరంతో ఆలపించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ జనగణమనతో సమానమైన వందేమాతరం గీతాన్ని బెంగాలీ రచయిత బంకించంద్ర చటర్జీ 1875లో రాశారన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఓ నినాదంలా మారి, భారతీయులందరిలో చైతన్యాన్ని నింపిందన్నారు. వందేమాతం గీతం స్ఫూర్తిని కొనసాగిద్దాం.. మన వారసత్వాన్ని చాటుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్, సురేంద్ర, రాజు, జమీల్ మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల పద్మావతీనగర్‌లోని ప్రవేటు కళాశాలలో వందేమాతరం వేడుకలు నిర్వహించారు. ముఖ్యవక్తగా డాక్టర్ ఉదయశంకర్ హాజరై వందేమాతరం గేయం రాయడానికి గల కారణాలు వివరించారు. రచయిత కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ వందేమాతరం దేశ స్ఫూర్తిని, త్యాగాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల నూనెపల్లి : వందేమాతరం గీతం దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో చూపించిన స్ఫూర్తిని, త్యాగాన్ని గుర్తు చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు, లింగాల గ్రామాల్లోని పాఠశాలల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీ మోహన్, ఉపాధ్యాయులతో కలిసి వందేమాతరం గేయం ప్రాముఖ్యత, అర్థాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలం: ప్రతి ఒక్కరూ మాతృభూమికి వందనాలు సమర్పించాలని శ్రీశైలం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఆలయ ప్రధాన వీధిలో సిద్ధరామప్ప వర్తక వ్యాపారుల ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపనకు సీఐ హాజరయ్యారు. కార్యక్రమంలో యాత్రికులతోపాటు ఆర్ఎస్ఎస్ సమన్వయకర్తలు చెన్నకేశవులు, గణపతి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు అరవింద్, యుగేందర్, వెంకటసుబ్బయ్య, మణికంఠ, శివ, మల్లికార్జున, వెంకటేశ్వర్‌రావు తదితరులు న్నారు. ఒకటవ, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లలో కూడా వందేమాతరం గీతాన్ని ఆలపించారు.


నంద్యాల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయశంకర్


శ్రీశైలంలో వందేమాతరం ఆలపిస్తున్న సీఐ ప్రసాదరావు


రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

● ఏఎస్పీ మందజావలి అల్ఫోన్స్

● పోలీసు స్టేషన్ తనిఖీ

గడివేముల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఏఎస్పీ మందజావలి అల్ఫోన్స్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం గడివేముల పోలీసు స్టేషన్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు చేపటాల్సిన చర్యలను వివరించారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. పల్లెల్లో అసాంఘిక ఘటనలో జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా అనుకోని సంఘటనలు, నేరాలు జరిగితే వెంటనే స్పందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌యూ స్నాతకోత్సవానికి మంత్రికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న ప్రతినిధులు

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న రాయలసీమ యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను కలిసి ప్రిన్సిపాల్ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ విద్యా సంస్థల అధినేత ఇంతియాజ్ అహ్మద్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షనర్ ఎస్‌బీఐలో ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు

నంద్యాల కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని పెన్షనర్లకు ఎస్‌బీఐ బ్రాంచీల్లో జీవన్‌ప్రమాణ్ ద్వారా ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించుకోవచ్చునని నంద్యాల రీజనల్ మేనేజర్ సూర్యప్రకాష్ తెలిపారు. స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా అన్ని బ్రాంచీలలో జీవన్‌ప్రమాన్ లైఫ్ సర్టిఫికెట్ ఉచితంగా రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలోని పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పశు గర్భకోశ చికిత్స శిబిరం

ఆత్మకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాలువ గ్రామంలో ఆత్మకూరు పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 52 మంది రైతులకు చెందిన 48 గేదెలు, 4 ఆవులను పరీక్షించి, 63 దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, పశు వైద్యాధికారులు అరుణ, అశోక్‌కుమార్,భువనేశ్వరి, అఫ్రిన్, సర్పంచ్ వెంకటరమణ, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరుడిపై దురుసు ప్రవర్తన

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అయ్యప్ప దీక్షను స్వీకరించిన భరత్ అనే విద్యార్థిపై కాంట్రాక్ట్ అధ్యాపకుడి దురుసుగా వ్యవహరించిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. అయితే విషయం తెలుసుకున్న అయ్యప్ప దీక్షాపరులు కళాశాల వద్దకు చేరుకుని సదరు అధ్యాపకుడు సుధాకర్‌ను నిలదీశారు. అయితే తాను అలా చెప్పలేదంటూ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ప్రిన్సిపల్ సుంకన్నను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు.

వైభవంగా రుద్ర కోటేశ్వరస్వామి కల్యాణం

- రుద్రకోటీశ్వర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన కార్తీక పౌర్ణమి వేడుకలను మొంథా తుఫాన్ నేపథ్యంలో గురువారం, శుక్రవారం నిర్వహించినట్లు రుద్ర కోటీశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవరావు తెలిపారు. ఈ రెండు రోజుల పాటు క్షేత్రంలో ఆలయ పురోహితులు లక్ష్మి చెన్న కేశవ శర్మ ఆధ్వర్యంలో రుద్రాణి సమేత రుద్ర కోటీశ్వర స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు రుద్రాణి సమేత రుద్ర కోటీశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండుగగా నిర్వహించినట్లు తెలిపారు. విచ్చేసిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉత్సవ మూర్తుల పల్లకీ సేవ ఊరేగించారు.


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రథమ నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం పలు శైవ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకాశదీపాలు భక్తులు వెలిగించారు. పట్టణంలోని ప్రథమనందీశ్వరాలయం, అమ్మస్పటికలింగేశ్వరాలయం, నాగనందీశ్వరాలయం, సోమనందీశ్వరాలయం, నాగనంది ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రథమనందీశ్వర సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నంద్యాల అర్బన్ తహసీల్దారు శ్రీనివాసులు, చలంబాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, బొల్లెద్దుల నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

శ్రీశైలం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సున్నిపెంటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీయూసీఐ నాయకులు కోరారు. శుక్రవారం వెల్పనూరు క్యాంపు కార్యాలయంలో టీయూసీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 15 రోజులకు ఒకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. అత్యవసర సేవలకు అంబులెన్స్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వందలాది మంది శ్రీశైలం వెళ్లి విధులు ముగించుకుని వచ్చేందుకు గతంలో ఉండే ఉచిత బస్సును నిలిపివేయడం వల్ల కార్మికులకు ఇబ్బందిగా మారిందన్నారు. అదే విధంగా దళిత కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు విజయ్ ఉన్నారు.

'ప్రజలకు దిక్సూచి ఎర్రజెండా'

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు దిక్సూచి ఎర్రజెండా అని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్, రజాక్ అన్నారు. అక్టోబరు విప్లవం ద్వారా రష్యా ముక్తి పొందిన రోజును స్మరిస్తూ స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్టోబరు విప్లవం నుంచే భారత్‌లో స్వాతంత్ర్య పోరాటం రగిలి బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టినట్లు తెలిపారు. అందుకే అక్టోబరు విప్లవం భారతీయులకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కిరణ్, గణపతి, సిలార్, మల్లయ్య, పుల్లయ్య, అబ్దుల్ రజాక్, ముర్తుజా, ఖాదర్‌బాషా, ప్రసాద్, కలిముల్లా, జబివుల్లా, మగ్బూల్, కృష్ణా తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

జూపాడుబంగ్లా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పరీక్షలు చేయించుకోని లక్షణాలు ఉన్నవారు తొలిదశలోనే నివారించుకోవాలని పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. మండలంలోని పారుమంచాలలో శుక్రవారం క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పొగాకు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. పురుషుల్లో వచ్చే మౌఖిక క్యాన్సర్‌వంటి రకాలపై అవగాహన కల్పించారు. మహిళల్లో వచ్చే సర్వికల్ క్యాన్సర్, వక్షోజ క్యాన్సర్ రకాలను వివరించారు. క్యాన్సర్ లక్షణాలు తెలియజేస్తూ నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో విద్యార్థులు చిత్రపటాలను రూపొందించి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో రాఘవేంద్రరావు మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారిందన్నారు. పొగాకు వాడకం, జీవనశైలి మార్పుల వల్ల వచ్చే క్యాన్సర్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే దీని కి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. విద్యార్థులు రూపొందించిన చిత్రపటాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు గులాబ్‌షా సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరుపుకున్నారు. క్యాన్సర్‌పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మురళికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఆత్మకూరురూరల్: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం బైర్లూటి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దీపిక, ఫార్మాసిస్ట్ వీరాంజనేయులు, ఏఎన్ఎం బేబి జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పారుమంచాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి మౌలిక, వైద్యసిబ్బంది


కొత్తపల్లి: క్యాన్సర్ పై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మెలకువలు పాటిస్తేనే నాణ్యత


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో

బండిఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం నిల్వ కోసం రైతులు తగిన మెలకువలు పాటిస్తేనే నాణ్యత ఉంటుందని ఏవో పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెంగళరెడ్డిపేట, ఈర్నపాడు గ్రామాల్లో రైతులు కోత కోసి ఆరబోసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ గింజలను శుభ్రం చేసి, తేమ శాతం 12 నుంచి 14 వరకు ఉండేవిధంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏఈవో సునంద ఉన్నారు.

10న రైతు ధర్నాను జయప్రదం చేయండి

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న చేపట్టనున్న రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ కోరారు. శుక్రవారం మండలంలోని నల్లకాల్వ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరన్న, రాముడు తదితరులున్నారు.

నివాళి అర్పించిన ప్రముఖులు


సౌందరాజుకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు టీడీపీ నాయకులు తమ్మడపల్లి విక్టర్ తండ్రి సౌందరాజు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు వేణుగోపాల్, రామిరెడ్డి నివాళి అర్పించారు.

కోలుకుంటున్న శిశువు

నందికొట్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వదిలి వెళ్లిన శిశువు కోలుకుంటుందని సీడీపీవో మంగవల్లి తెలిపారు. నంద్యాల శిశుసంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం జరుగుతోందన్నారు. శిశువు ఆరోగ్యంగా ఉందని సీడీపీవో తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయికబడ్డీ పోటీలకు జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో చిన్నమద్దిలేటి తెలిపారు. ఈనెల 6న కర్నూలు నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన అండర్17 విభాగంలో అబెల్‌రాజు, అండర్ 14విభాగంలో సంతోష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు హుసేన్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ప్రతాప్ కుటుంబానికి పార్టీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ రూ. 5లక్షల ఆర్థిక సాయం శుక్రవారం రాత్రి అందించారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త కె.ప్రతాప్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పార్టీ కార్యకర్తల నిధి నుంచి రూ.5లక్షల ప్రమాదబీమా సొమ్మును బీసీ ఇందిరమ్మ అందించారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కుటుంబపెద్ద దిక్కుకోల్పోయి కష్టాల్లో ఉన్న కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ ప్రాథమిక సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ అందిస్తున్న ప్రమాదబీమా కార్యకర్తలకు ఆర్థికంగా చేయూత నిస్తోందన్నారు. ఈసందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, బీసీ ఇందిరమ్మలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని మృతి



పద్మిని(ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో వైరల్ ఫీవర్‌తో విద్యార్థిని మృతి చెందింది. గ్రామంలోని ప్రభుత్వ ఆదర్శ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న తలారి పద్మిని (9) వారం రోజుల క్రితం వైరల్ ఫీవర్ సోకి అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మిని కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు తల్లిదండ్రులు తలారి రాజు, రామాంజనమ్మ వెల్లడించారు. దీంతో పాఠశాలలో తీవ్ర విషాదం నెలకొంది. ఎంఈవో అబ్దుల్ కలాం విద్యార్థినీ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యం

చాగలమర్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని నాలుగు నెలల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. విద్యార్థిని ఇంటిపై బెంగతో వారం రోజుల క్రితం పాఠశాలలో ఎవరికి చెప్పకుండా పాఠశాల వెనుక ఉన్న గోడ దూకి వారి అమ్మమ్మ ఊరు కదిరిపురానికి వెళ్లిందని అన్నారు. తల్లిదండ్రులు గుర్తించి వెంటనే అమ్మమ్మ వద్ద ఉన్న కూతురును తిరిగి పాఠశాలలో చేర్పించారు. అయితే ఇంటిపై బెంగతో శుక్రవారం ఉదయం పాఠశాల నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిందని అన్నారు. ఇంటికి వెళ్లకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాఠశాల ఎస్‌వో కూడా విద్యార్థిని అదృశ్యంపై ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

స్వాతంత్రోద్యమ స్ఫూర్తి వందేమాతరం

150 ఏళ్లు పూర్తి

ప్యాపిలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ స్ఫూర్తి వందేమాతరం గేయం అని ఎస్ఐ మదుసూదన్ అన్నారు. బంకింగ్‌చంద్ర ఛటర్జీ వందే మాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శిశుమందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాలో విద్యార్థులు వందేమాతరం గీతాలాపాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మదుసూదన్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కారుల్లో వందేమాతరం గీతం ఉత్సాహాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి, ఓబులేసు, బీసీ విజయ్‌కుమార్, వాసు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన మహోజ్వల మంత్రం వందేమాతరమని ఎంపీడీవో నూర్జహాన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం వేడుకలు నిర్వహించారు. ఆళ్లగడ్డ నియోజక వర్గం అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు పాత బస్టాండ్ కూడలిలో సామూహిక వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఎంఈఓ శోభావివేకవతి, టౌన్ ఎస్ఐ జయ్యప్ప, మున్సిపాలిటీ మేనేజర్ ఆనంద్, ఎంఈఓ-2 గంగాధర్, రిటైర్ జిల్లా న్యాయాధికారి శివప్రసాద్, డాక్టర్ రామ్‌గోపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కస్పా, తెలుగు ప్రాథమిక, ఉర్దూ, పాఠశాలల హెచ్‌ఎంలు సుంకన్న, మహబూబ్ బాషా, హెచ్‌ఎం ప్రతాప్‌లు విద్యార్థులు వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. పలు పాఠశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభగల విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో ఎంఈవో స్వరూప, బీజేపీ నాయకులు శరత్‌చంద్ర, యాదగిరి, టీచర్ సతీశ్, జిల్లా యూటీఎఫ్ సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, అబ్దుల్ కలీం పాల్గొన్నారు.

రుద్రవరం: వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వందేమాతరం గేయాన్ని ఉద్యోగులు ఆలపించారు. పంచాయతీకార్యదర్శి రామక్రిష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో శుక్రవారం 150 ఏళ్ల వందేమాతరం గేయం వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం సుధాకర్ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు 150 ఏళ్ల సంఖ్య ఆకారంలో కూర్చొని దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుకవారం వందేమాతర గీతాలపనతో మార్మోగాయి. మండల పరిషత్ కార్యాలయం, కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో ఎంపీడీవో రామసుబ్బయ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికారులు, విద్యార్థులు వందేమాతం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిని శ్రీలేఖ, ప్రధానోపాధాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: బంకింగ్ చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ జాతీయ హోదాన్ని కల్పించారు. శుక్రవారం డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి డోన్ గాంధీ చౌక్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు బద్రి సుధాకర్ పాల్గొని వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సేవా నిర్వహకుడు రఫీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న అధికారులు



ప్యాపిలిలో..



రుద్రవరంలో ..



బనగానపల్లె కస్పా ప్రాథమిక పాఠశాలలో.. డోన్‌లో బంకింగ్‌చంద్ర ఛటర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం, చిన్నవంగలిలో 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు, సంజామలలో..

కార్యకర్తలకు అండగా ఉంటాం



వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న ఉగ్రసేనారెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్నివిధాల అండగా ఉంటామని అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో బ్లాక్ ఫంగస్ వ్యాధితో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త దొమ్మరి వెంకటసుబ్బయ్యను ఉగ్రసేనారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు దోనపాటి శంకర్‌రెడ్డి, రామాపురం భాస్కర రెడ్డి, సురేంద్ర, హుసేన్, మధు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

డోన్ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం మానుకోవాలని డోన్ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని 28వ వార్డులో వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. కౌన్సిలర్ సుంకన్న, నాయకులు గోపాల్, వలి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఆళ్లగడ్డ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు ఏపీ మోడల్ స్కూల్ గణిత ఉపాధ్యాయుడు వెంకట చంద్రను మంత్రి నారా లోకేశ్ అభినందించడంపై శుక్రవారం ఎంఈవో శోభావివేకవతి, ఎంపీడీవో నూర్జాహాన్ పూలమాలలు కప్పి సన్మానించారు. గణిత ఉపాధ్యాయుడు వెంకట చంద్ర మాట్లాడుతూ నాకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలపడంతో మరింత భాద్యతలను పెంచాయన్నారు. ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిమెంటు నగర్‌లో చండీ హోమం

బేతంచెర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటు నగర్‌లో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ముందుగా గ్రామస్థులు బోడ్రాయికి పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు చండీ హోమాన్ని నిర్వహించారు.

ఆరోగ్యకర జీవనశైలితో క్యాన్సర్‌కు దూరం

సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి

బనగానపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకుంటే క్యాన్సన్‌కు దూరం కావచ్చని బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరిండెంటెంట్ డాక్టర్ ఉమాదేవి అన్నారు. శుక్రవారం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ నివారణపై అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ మానవుని జీవనశైలిలో మార్పుతో బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. నోటి, గర్భాశయ క్యాన్సర్‌లకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శైలజ, నాగప్రసాద్, రాజేశ్, రాధారాణి, స్రవంతి, ఆశావర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి

రుద్రవరం: క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యాధికారులు అమరనాథరెడ్డి, శ్రీజారెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆల మూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు.

చాగలమర్రి: స్థానిక 12వ వార్డులో క్యాన్సర్ వ్యాధిపై వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ అధికారి సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఏ మనోహర్, ఏఎన్‌ఎం గార్లెట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రమైన సంజామలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలెహ బేగం ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సీహెచ్‌వో విమల ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్యాన్సర్‌పై విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం చెన్నమ్మ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరం అవుతుందని వైద్యులు ఆంజనేయులు, ముఖేష్‌కుమార్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శిరివెళ్లలో వైద్య సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ముర్తుజావలి ఆధ్వర్యంలో ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు



శిరివెళ్ల, క్రిష్టిపాడు, బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

జిల్లా స్థాయి చెకుముకి

పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొలిమిగుండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమి గుండ్లలోని మోడల్‌స్కూల్, లిటిల్‌ప్లవర్ పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు మండల క్రీడల కోఆర్డినేటర్ నాగరాణి శుక్రవారం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన మోడల్‌స్కూల్, లిటిప్లవర్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నాగరాణి తెలిపారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల హైస్కూల్ హెచ్ ఎం కొండప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన మల్లికార్జున

డోన్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ అండ్ భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజా వైద్యశాల మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బెస్త సంక్షేమ అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున మంత్రి అభినందనలు తెలిపారు. మల్లికార్జున మాట్లాడుతూ తనను రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో పాటు మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

కొలిమిగుండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అబ్జర్వర్లుగా ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ట్రైనర్స్ పాండురంగారెడ్డి, డానియల్‌లు బోధనా పద్ధతులు, మెరుగైన విద్య తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో సేవలు సులభతరం

ప్యాపిలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలకు సేవలు సులభతరంగా మారాయని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండలంలోని మెట్టుపల్లిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు తమ సెల్ ఫోన్ ద్వారా తమ సమస్యను వాట్సాప్ ద్వారా పంపితే అధికారులు పరిశీలించి పరిష్కారం చూపుతారన్నారు.

చాగలమర్రి: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై శుక్రవారం సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాట్సాప్ విధానంపై కుటుంబ సభ్యులకు వివరించి 746 సర్వీసుల గురించి తెలియజేస్తామన్నారు.

నేడు చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

అవుకు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం కార్తీక దీపోత్సవం, జ్వాలాతోరణం, నిర్వహిస్తున్నట్లు అర్చకుడు వెంకటరమణాచార్యులు శుక్రవారం తెలిపారు. అర్చకుడు మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో రాత్రి 6.30 గంటలకు జ్వాలాతోరణం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు కార్తీక దీపాల వెలుగులో స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు

బనగానపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్ర మంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

ఆళ్లగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక భూమా శోభానాగిరెడ్డి మెమోరియల్ కళాశాలలో ఫేర్ వేల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగత్ విఖ్యాత్‌రెడ్డి పాల్గొని భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిల చిత్రపటాలకు నివాళి అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శోభా నాగిరెడ్డి, భూమా నాగిరెడ్డి చిత్ర పటాలకు నివాళి అర్పిస్తున్న జగత్‌విఖ్యాత్‌రెడ్డి

మధ్యంతర భృతి ప్రకటించాలి

చాగలమర్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) సంఘం గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, ఆళ్లగడ్డ మండల కార్యదర్శి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల నిర్వహణలో పాల్గొన్న సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లకు రావాల్సిన రెమ్యూనెరేషన్ ఇవ్వలేదని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

సంజామల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వయోజన విద్య నోడల్ అధికారి బీవీ భాస్కర్ రెడ్డి వలంటరీ టీచర్లను కోరారు. శుక్రవారం సంజామల స్త్రీశక్తి భవనంలో పొదుపు మహిళలు, వలంటరీ టీచర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. వెలుగు ఏపీఎం గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఈవో ఈశ్వరయ్య, వయోజన విద్య నోడల్ అధికారి బీవీ భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడారు.